



# పెళ్ళైతే చాలు

కొండముది శ్రీరామచంద్రమూర్తి

గిరిజకు పెళ్ళవుతున్నదంటే నిజానికి నేనెంతో సంతోషించాలి. కానీ నాకు సంతోషం కలగడంలేదు, దుఃఖం వస్తోంది, కోపం కలుగుతోంది. ఈ సంఘం మీద, ఆచారాల మీద, మనుష్యుల సిగ్గులేని స్వార్థం మీద అసహ్యం వేస్తోంది.

"అవతల నీ స్నేహితురాలు గౌరీపూజకు కూచోబోతోంటే, ఇంకా ఇక్కడ నువ్వు, చేతిలో పుస్తకం పట్టుకుని, తలైనా దువ్వుకోకుండా, చీర మార్చుకోకుండా, హవ్వ, చూసే వాళ్ళేమనుకుంటారూ, ఆ అమ్మాయికి పట్టిన అదృష్టానికి నువ్వేదో అసూయపడి పోతున్నావని నోళ్ళు నొక్కుకోరూ ?... పద పద. కాస్త మొహం కడుక్కుని, లక్షణంగా బొట్టు పెట్టుకుని..." మా అమ్మ నా చేతిలో పుస్తకం లాగేయబోయింది.

"ముందు నువ్వెళ్ళమ్మా, తర్వాతవస్తాన్లే, మెల్లిగా !" నేను లోపలకు వెళ్ళిపోయాను, చివాలున.

"రారా ! ఆలస్యంచేయకు, బావుండదు." అమ్మ గిఫ్ట్ ప్యాకెట్టు తీసుకుని వెళ్ళిపోయింది.

గిరిజ వాళ్ళ ఇంట్లో నుంచి మంగళ వాద్యాలు వినిపిస్తున్నాయి. వాకిలి ముందు వేసిన పందిరి మీది నుంచి వస్తున్న రాత్రిగాలి పచ్చికొబ్బరాకుల వాసనను పరవశంగా మోసుకు వస్తోంది. వాళ్ళ ఇంట్లో, వాళ్ళ ఇంటి ముందు జరుగుతున్నదంతా నాకు కనిపిస్తోంది, వినిపిస్తోంది. ఆడవాళ్ళ పట్టుచీరల రెప రెపలు, మగవాళ్ళు పగలబడి నవ్వుకొనే హాస్యోక్తులు, రిక్షాలు గంటలు గణగణ మోగించుకుంటూ పందిరి దాకా వచ్చి అక్కడ తమ సరుకును ఖాళీచేసి వెనక్కు మళ్ళడం; ఒకటి రెండు కార్లు వచ్చి కీచు మంటూ ఆగిన తర్వాత, వాటిల్లోంచి వడ్డాణాల వాళ్ళూ, వంకీ చేతుల వాళ్ళూ, పొందూరు ఖద్దరు వాళ్ళూ, ఉంగరాల తళ్తళ చేతుల్తో, హుందాగా కిందకు దిగి ఆచి తూచి అడుగు వేస్తూ పెళ్ళి పందిట్లోకి నడవడం;

"అదుగో, అదుగో వరపూజకు పెళ్ళి కొడుకు వస్తున్నాడు !"

"స్నాతకం వాళ్ళ ఊర్లోనే చేసుకుని వచ్చేశారేమిటే ?"

"వాళ్ళ ఊరంటావేమిటే – నువ్వెక్కడో పిచ్చిదాన్లా వున్నావే– పెళ్ళికొడుకూ వాళ్ళది మహారాణీపేట కాదూ ?"

"అట్నాగా, చెప్పావు కాదు–పెళ్ళికొడుకు ఏం చేస్తున్నాడేవిటి ?"

"కాలేజి ప్రిన్సిపాల్టమ్మా !"


సంతానము, గర్భాశయ వ్యాధులు సుఖప్రసవము సెక్స్ అంతరంగిక సమస్యలు మొలలు,చర్మవ్యాధులకు అనుభవ చికిత్స. పోస్ట్‌ద్వారా చికిత్సకలదు.
సరోజ నర్సింగ్ హోమ్
డా. ఎస్.సరోజినీదేవి - డా. వి. మధు
(సెక్స్ స్పెషలిస్ట్స్)
శ్రీనివాసమహల్,గణపతిరావురోడ్, విజయవాడ-1.
బ్రాంచి: చిన్నాటవర్స్,శీలంవారి వీధి,గుంటూరు.

పవిత్ర రుద్రాక్ష
1 నుండి 14 ముఖములుగల పవిత్ర రుద్రాక్షలు, చందనం, తులసి, పసుపుపచ్చ మరియు గులాబిరంగుల జపమాలలు, శిలాజిత్తు, గోరోచనం, దక్షిణావర్త శంఖము, అదృష్టమును కల్పించే శ్రేష్ఠమైన రాళ్ళు, లభించును. కోరినవారికి ధరలపట్టీ పంపబడును. హిందీ లేక ఇంగ్లీషులో వ్రాయండి.
Shree Jagdamba Bhawan
(A.M.) SONEPAT.131001.

మీ గృహాలంకరణకు
కావలసిన
ఫర్నిషింగ్స్, డోర్ కర్టెన్స్
బెడ్ షీట్స్, టవల్స్
కార్ సీట్ కవర్స్, సోఫా కవర్స్‌కు
దర్శించండి
ఫోన్: 73708
డెకార్స్
V.H.R.కాంప్లెక్స్, బీసెంట్ రోడ్
విజయవాడ-2.
PAPUB

పెండ్లి ముందు, తర్వాత

శక్తిగత గుహ్యరోగములకు శాస్త్రీయమైన పద్ధతులలో ఆరోగ్యమునకు, యవ్వనమునకు ఉత్తమ చికిత్స చేయుదురు.
భారత ప్రఖ్యాత సెక్స్ స్పెషలిస్ట్
Dr. RAI
(GOVT.REGD.)
ఉ. 8.00 నుండి 1 గం.వరకు సా. 4 నుండి రాత్రి 9.30 వరకు
ఆదివారం సెలవు లేదు.
రాయ్ మెడికల్ హాల్
ESTD (1950)
అలంకార్ టాకీస్ వద్ద...గాంధీనగర్
విజయవాడ-3..ఫో: 74658

# పెళ్ళైతే చాలు

"బావుంది, బావుంది, వింతొస్తుందం టావ్ జీతం ?"

"రెండువేలకు పైనే వస్తుందట! అయినా ముష్టి జీతం–అదో లెక్కా వాళ్ళకు? జగదాంబా జంక్షన్‌లో నాలుగు కొట్లున్నాయట వాళ్ళకు, ఆ నాలుగు కొట్ల మీదా మూడువేలు వస్తుందటమ్మా ఆదాయం!! విజైనగరంలో వో వీధి వీధంతా వాళ్ళదేట! అనకాపల్లిలో బంగారం పండే పొలం యాభై వికరాలుందట!"

"అంత వున్న వాళ్ళు ఈ అమ్మాయి నెందుకు చేసుకుంటున్నారో ?"

మా కాంపౌండుగోడ పక్కనే నిలబడి ఆ ఇద్దరు వయసు మళ్ళిన ఆడవాళ్ళు మాట్లాడుకొంటున్నారు. ఆ ఇద్దరి గొంతులూ పెద్దవే. వాళ్ళ మాటలు నాకు స్పష్టంగానే వినిపిస్తున్నాయి.

బొంగురు గొంతు ఆవిడ అడిగిన ప్రశ్నకు కీచుగొంతు ఆవిడ గొంతు తగ్గించి, బుగ్గలు నొక్కుకొంటూ ఏదో అన్నది. ఇంతలో మళ్ళీ మొదటి ఆవిడ గొంతు పెద్దదైంది.

"చూడు, చూడు, అటు చూడు; ఆ పెళ్ళికొడుకుని చూడు, వింత ఇదిగా వున్నాడో!"

"అవునవును. వింతో తీవిగా వున్నాడు."

పెళ్ళికొడుకు కారులో నుంచి దిగాడు. విలక్ట్రిక్ లైట్లలో అతని బట్టతల మెరుస్తోంది. చెంపల మీద విషర్స్ నలుపూ తెలుపూ కాని రంగులో వున్నాయి. మొహం మీది ముడతల్లో నలభై ఏళ్ళు దాటిన వయసు చిక్కుపడి గిజగిజ కొట్టుకుంటోంది. పెళ్ళికొడుకు కారుకు కొంచెం దూరంలో మరో కారు వచ్చి ఆగింది. అందులో నుంచి బిక్కుబిక్కుగా వయసు వచ్చిరాని నలుగురుపిల్లలూ, వాళ్ళ వెనగ్గా ఓ మధ్య వయసు ఆడమనిషీ, ఆమె చెయ్యి పట్టుకుని ఓ ముసలాయనా దిగారు.

"వింత మంచి పిల్లలా మీరు ? మీ నాన్న పెళ్ళి చూడ్డానికి వచ్చారా, వరదాపడి! అదిగో మీ మరో అమ్మ, ఆ మూల గదిలో వుంటుంది. వెళ్ళి చూడండి. చూపిం తర్వాత పతిదిట్లోకి వచ్చి వో పక్కగా కూచోండి."

ఆ పిల్లలు తలలూపి పెళ్ళికూతురు వున్నచోటుకు పరుగెత్తుకు వెళ్ళారు. పందిరంతా పెళ్ళికొడుక్కు అడుగులకు మడుగులొత్తుతోంది. పెళ్ళి మొదలైంది.

గిరిజను గంపలో కూచోపెట్టి పెళ్ళిపీటల దగ్గరకు తీసుకువచ్చారు. గంపలో ముడుచుకుని కూచున్న గిరిజ ముద్దమందారంలా వుంది, ముగ్ధ మనోహరంగా వుంది.

పెళ్ళి పీటలమీద రెండో పెళ్ళికి తయారయిన నలభై ఏళ్ళు దాటిన బట్టతల పెళ్ళికొడుకు. అతనికి ఎదురుగా బుగ్గనచుక్కతో తలలో పూలతో, నొసటన బాసికంతో, తలంబ్రాల చీర కట్టుకుని, సిగ్గు సిగ్గుగా భయం భయంగా తలవంచుకు కూచున్న పదహారేళ్ళ గిరిజ... వాళ్ళకు ఎదురుగ్గా మొదటి వరుసలో వరుసాగ్గా కూచుని ఆసక్తిగా చూస్తున్న నలుగురు పిల్లలు... నాకది పెళ్ళిమంటపంలా కనబడం లేదు. ఆ పెళ్ళిపీట వధ్యశిలలా కనిపిస్తోంది.

* * *

గిరిజ ఫస్టు ఫారంలో చేరింది, నేను సెకండ్ క్లాసులో వున్నప్పుడు. గిరిజకు చీర కట్టుకోడం నేను నేర్పాను. గిరిజ పదో తరగతి ఫస్టున ప్యాసై, "అక్కా, మా నాన్నతో నువ్వు చెప్పవూ, ఇంకా నన్ను చదివించమని!" అని అడిగినప్పుడు వాళ్ళ నాన్నతో నేను దెబ్బలాడాను. అప్పటికి నేను యూనివర్సిటీలో యం. ఏ. లో వున్నాను.

"చదివించనమ్మా!" అన్నాడు గిరిజనాన్న నేను చెప్పిందంతా విని, నా మాటల్ని కొట్టి పారేస్తూ.

నాకు కోపం వచ్చింది. "ఎందుకనీ?" రెట్టించాను.

"చదువులూ ఉద్యోగాలూ ఆడవాళ్ళ విషయంలో ఉన్నవాళ్ల ఊసుబోకవ్యవహారాలు.

## రీతి

తాను కూర్చున్న కొమ్మను
　　　　వరికే కాళిదాసు
మూర్ఖుడు
మరొకడు కూర్చున్న
　　　　కొమ్మను వరికేవాడు
యోగ్యుడు.

　　　　విన్. మునిసుందరం

కన్న తండ్రిగా దాన్నో ఇంటిదాన్ని చేసి అవతలకు పంపించేస్తే, ఈ జీవితానికా సార్థకత చాలు. కట్నాలా, పెద్దగా ఇమ్మకో లేని ఎలిమెంటరీ స్కూలు బడిపంతులు గంగిరెద్దు బతుకు నాది. సంబంధాలా, వెతికే ఓపిక చచ్చిపోయింది నాలో, మొదటి ముగ్గురి కూతుళ్ళ పెళ్ళిళ్ళు చేసేసరికి. అంచేత ఏ రెండో పెళ్ళివాడు దొరికినా, ఆ ఏడుకొండల వాడికి జోలెత్తుతాము."

ఆ ఏడుకొండలవాడు అతను కట్టబోయే జోలికి ఆశపడి, ఈ పెళ్ళి కొడుకును అతనికి చూపించాడు.

"గిరిజా! నీ కిష్టమైందా ఈ సంబంధం?"

పెళ్ళి నిశ్చయం చేసుకోబోయేముందు గిరిజను ఓ మూలకు తీసుకువెళ్ళి రహస్యంగా అడిగాను.

"మా నాన్న కిష్టమైంది. కట్నం బాధ లేదు. ఇంకా నా ఇష్టం ఎందుకక్కా?" గిరిజ అమాయకస్వరంలో వున్న ఆ ప్రశ్నా తీవ్రత నన్ను విచలితను చేసింది. ఈ దేశంలో అమ్మాయిలకు చదువక్కరలేదు, ఉద్యోగాలక్కరలేదు, వ్యక్తిత్వం అక్కరలేదు, పెళ్ళైతే చాలు అనుకుంటున్నారు తల్లిదండ్రులు. కానీ వాళ్ళ గుండెల్లో మండుతున్న మహోగ్ని కణిక్ని గురించి వివరు పట్టించుకుంటారూ?

గిరిజకు తాంబూలాల తతంగం ముసి ముసి నవ్వుల మధ్య ముగిసిపోయింతర్వాత, మా అమ్మ నన్ను తీవ్రంగానే మందలించింది.

## పెళ్ళైతే చాలు

"ఆ పిల్ల ఇష్ట పడే చేసుకుంటోందో, కష్టంగానే తాళి కట్టించు కుంటుందో, నీకెందుకే? నీ సంగతి నీకు చూసుకోడం చేత కాదు, ఇంకొకళ్ళ వ్యవహారం నీ కెందుకూ? అయినా నీకేం తెలుసు? పెళ్ళికి ముందు వింత మూతి ముడుచుకున్నా, పెళ్ళి తర్వాత కట్టుకున్నవాడి వెనక వెనకే తిరుగుతారీ ఆడపిల్లలు! అప్పుడు వయసు బేధమూ వుండదు, తెలుపూ నలుపూ వుండదు."

మా అమ్మ అట్లా కోప్పడటానికి కారణం వేరేవుంది. ఏ సంబంధం వచ్చినా నేను కాదు పొమ్మంటున్నాను. నాకు నచ్చిన వాడు కాకపోతే, అతడు ప్రిన్స్ ఛార్లెస్ అయితే మాత్రం నాకేం? విన్నటి వినాయక చవితికి ఇరవైనాలుగువెళ్ళి అయిదు వస్తుంది. ఆ ఏటికి ఆ ఏడు పైబడిన కొద్దీ, నేను పెళ్ళి కాకుండా కన్యగానే మిగిలిపోతానేమోనని ఆమె భయం. తగిన మగవాడు దొరక్కపోతే, కన్యగానే వుండిపోతే కొంపలు మునిగిపోతాయా అని నా భావం.

కానీ నా మానాన నన్ను స్వేచ్ఛగా ఉండనీయడంలేదు ఈ సంఘం.

"ఏమమ్మా - మీ అమ్మాయికి పెళ్ళి చేయవూ?" అని అమ్మలక్కల పరామర్శ.

"మాకు తెలిసిన రెండో పెళ్ళి సంబంధం ఒకటి వుంది. చెప్పమంటారేమిటి?" అని కొందరి మగవారి ప్రశ్న.

ఒకరోజు సాయంకాలం బిక్కు బిక్కుగా వచ్చింది గిరిజ నా గదిలోకి అప్పుడే శ్రీదేవి నవలం కాలాతీత వ్యక్తులు చదివి అవతల పెట్టాను. గిరిజ కళ్ళలో ప్రశ్న. ఆమె పెదిమలమీద ఏదో అనాలన్నతహతహ.

"ఏం గిరిజా, ఏం కావాలి?"

"అక్కా...?"

"ఏమమ్మా... చెప్పు."

"మీ కాలేజీలో లాజిక్ లెక్చరరు చచ్చిపోయిందట కదా?"

"అవునమ్మా, పాపం, కాన్పు కష్టమై వైద్య సహాయం సమయానికి అందక..."

"ఆవిడ మొగుడు డి యస్ పేట కదా?"

"అయితే...?" నా బొమలు ముడిపడ్డాయి.

గిరిజ గభాలున అన్నది-"ఆయన్ను నువ్వు చేసుకుంటావా?"

నేను ఉలిక్కిపడ్డాను నాబీపున ఎవరో ఛెళ్ళున కొరడాతో కొట్టినట్టయింది.

"ఇంపాసిబుల్! నేనా... ఆ విడోయర్ని? ఆయనభార్యా నేనూ ఎంత క్లోజ్ ఫ్రెండ్సమో నీకు తెలీదు గిరిజా! ఆవిడ పోయి యింకా నెలైనా కాలేదు. అప్పుడే ఆయనగారికి మరో పెళ్ళాం కావల్సి వచ్చిందా? - ఏం మగజాతి ఇది!!"

నా మాటలు వెనకనుండి మా అమ్మ విన్నట్టుంది. గంభీరంగా మగవాళ్ళను సమర్థిస్తున్నట్టుగా అన్నది, "అతగాడికోసం కాదే ఈ పెళ్ళి? కన్ను తెరవని ఆ పసికందు కోసం!"


# 60 రోజుల్లో ఇంగ్లీషు భాష

రచన : డి. వి. యస్. ఆర్. మూర్తి

(386 పేజీలు వారపత్రికల సైజు)

వెల : రు. 21-00

(త్వరగా, సులభంగా, ఇంగ్లీషు మాట్లాడడం, వ్రాయడం నేర్పే పుస్తకం)

అన్ని షాపులలోనూ దొరుకుతుంది, లేదా 20. రూపాయలు M.O. చేయండి. రూపాయికి V.P.P. పంపుతాము.

క్వాలిటీ పబ్లిషర్స్, రామమందిరం వీధి, విజయవాడ-2.

"ఆయానొకత్తెను పెట్టుకుంటే సరిపోదూ?" ఊసడింపుగా అన్నాను.

"ఎంతటి ఆయా అయినా, కట్టుకున్న పెళ్ళాంతో సాటి అవుతుందా?"

ఇప్పుడు కూడా గిరిజను తన పిల్లల్ని పెంచడం కోసమే ఆ ప్రిన్సిపాలు పెళ్ళి చేసుకున్నాడా? తన పదవిని ఎరగా జూపి, తన హోదాను ఆశపెట్టి, తన డబ్బును లంచం చేసి, తన వయసును కప్పబెట్టి, బీదరికాన్ని తన స్వార్థానికి అతను వాడుకున్నాడా? వాడుకున్నాడనే నా ఆరోపణ.

*   *   *

గిరిజను మూడునిద్దర్లకు అత్తవారింటికి పంపించారు. ఆ సమయంలోనే మిగిలిన ముచ్చట కూడా తీరిపోయిందన్నారు. గిరిజను అత్తవారింటికి పంపించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. పదహారు రోజుల పండుగ లోపల అయితే తిథీ వార వర్జ్యాలు చూడక్కర్లేదట!

"ఆ పిల్ల మళ్ళీ వెళ్ళిపోతుందేమో, ఒకసారి చూసి రారాదూ?" అన్నది అమ్మ.

నేను చివాలున తలెత్తి ఆవేశంగా అన్నాను—"ఏం చూసి రమ్మంటావ్? తన కూతురు వయసున్న చిన్నదానితో ఆ రెండో పెళ్ళి మగడు ఎట్లా సంసారాలాడుతున్నాడో ఏమని అడిగి రమ్మంటావ్?"

"పోవే నీ మాటల కేంటి? పుట్టింట్లో వున్నప్పుడు గిరిజ పట్టుచీర మొహం చూసి ఎరుగునా? ఇప్పుడు చూడు, ఎన్ని పట్టు చీరలో!! ఒంటినిండా నగలు, వేళకు సుష్టుగా భోజనం, అమ్మా అమ్మా అంటూ కొంగు పట్టుకు తిరిగే నలుగురు పిల్లలు, వీధిలో కారు, గుమ్మం దగ్గర నౌకరు, ఇంతకన్నా ఏం కావాలే ఆడపిల్లకు?"

"ఒకసారి చూసొస్తే పోతుంది కదా! ఈ భారతం వినక్కర్లేదు" అనుకుని గిరిజవాళ్ళ గుమ్మంలోకి వెళాను.

ఈ అయిదురోజుల అత్తవారింటి సంసారానికే గిరిజ మొహం వాడిపోయింది. ఒంటికి పట్టుచీర వుంది. మెడలో నగలున్నాయి. కాళ్ళకు మెట్టెలున్నాయి! పమిట చాటున నల్లపూసల్తో మంగళసూత్రాలు ధగధగలాడుతున్నాయి.

"ఏమిటే గిరిజా ఏమిటి విశేషాలు?" నవ్వుతూ పలకరించాను.

"లోపలకు రా అక్కయ్యా!" నన్ను చూడగానే ఆమె మొహంలోకి కళ వచ్చింది.


కాఫీ తాగుతూ ఇద్దరం ఏవో పిచ్చాపాటీ మాటాడుకున్నాం.

ఆ తర్వాత అసలు విషయం బయట పడింది.

"అట్లా అన్నాడా?" అన్నాను నేను దిగ్భ్రమలో.

సమాధానం చెప్పలేక మౌనంగా, దిగులుగా తలాడించింది.

ఏవో నాలుగు వూరడింపు మాటలు చెప్పి వయట పడ్డానే కాని మౌనంలోంచి గిరిజ అడుగుతున్న ఆ ప్రశ్న నన్ను జలదరింపు చేస్తూనే వుంది.




గిరిజ మొగుడు మొదటిభార్య వున్నప్పుడే, నలుగురు పిల్లల తండ్రయిన తర్వాత, ఇహ తనకు సంతానం చాలనుకుని ఆపరేషన్ చేయించేసుకున్నాట్ట. ఇప్పుడు గిరిజను పెళ్ళి చేసుకున్న తర్వాత మొదటి రాత్రి నాడు ఆ అమ్మాయితో అన్నాట్ట "ఇదీ సంగతి. నీకు హాఫ్ బెండ్‌నే! కానీ నిన్ను తల్లిని మాత్రం చెయ్య లేను. ఐయామ్ సారీ! నా పిల్లలకు తల్లిగా వుండు, నీకు ఏం కావాల్సినా అనుభవించు. బట్ డోన్ట్ వాంట్ టు బీయే మదర్!"

"నేనిహ జన్మలో తల్లిని కాను. ఇంకా ఎందుకూ నా ఆడజన్మ?" అని గిరిజ అడుగుతున్నట్లు—

"ఆడజన్మే మధురం!" అని పాడుతున్న రేడియో గొంతు నొక్కేశాను ఆ కోశంతో.

"చూశావా అమ్మా - గిరిజకు జరిగిన అన్యాయం?" అమ్మతో అన్నాను.

"అన్యాయం లేదూ, గాడిదగుడ్డూ లేదు. పెళ్ళైంది చాలు, అందుకు సంతోషించమను. మహారాజా లాంటి భర్త...కనకుండానే నలుగురు పిల్లలు...ఆ అదృష్టం నీకు పట్టి వుంటే నేనెంత సంతోషించి వుండేదాన్నో!!" కళ్ళు తుడుచుకుంటూ అవతలికి వెళ్ళిపోయింది అమ్మ.

'తన కూతురు తల్లి కాలేదు' అన్న సంగతిని విన్న గిరిజ వాళ్ళ నాన్న కూడా పెద్దగా బాధపడినట్లు లేదు. ఈ పెళ్ళి మూలంగా ఆయన స్టేటస్ పెరిగింది, అది చాలు ఆయనకు. ఈ మధ్య గిరిజ అంతగా నాకు కనబడడంలేదు. 'ఏమైంది?' అని అమ్మనే అడిగాను.

"వ్రతాలూ, చన్నీళ్ళ స్నానాలూ, పూజలూ, పురస్కారాలూ, ఇప్పుడు దేవత లాగా ఎంత శుద్ధిగా కనిపిస్తోందో!" అన్నది ఆరాధనా భావంతో.

అట్లాకాక మరెట్లా చేస్తుంది పిచ్చి గిరిజ! ఆమె నిస్సహాయత ఆమెను ఆ మార్గం వేపుకు బలవంతంగా నెడుతోందని గిరిజకూ తెలీదు, మా అమ్మలాంటి వాళ్ళకూ తెలీదు!! నాకు తెలిసీ ప్రయోజనం లేదు. ఎట్లాగో అట్లా నాకూ పెళ్ళైతే చాలునని ఆరాటపడిపోతున్న ఈసమాజంలో ఎంతకాలం ఇట్లా స్వతంత్రంగా ఉండగలనో నాకూ తెలీదు.